క్లుప్తంగా

త్వరలో పేదలకు ఉచిత వైద్య శిబిరాలు



మాట్లాడుతున్న డాక్టర్ తాడి ప్రకాష్ రత్నం

పాయకరావుపేట : నియోజకవర్గంలో త్వరలో పేదలకు ఉచితంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని విశాఖ స్టీల్‌ప్లాంట్ వైద్యుడు డాక్టర్ తాడి ప్రకాష్ రత్నం తెలిపారు. పట్టణంలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. తాను విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌లో అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌గా వైద్య సేవలు అందిస్తున్నానన్నారు. తాను వైఎస్సార్ సీపీ అభిమానినని పార్టీ గెలుపుకోసం, అభివృద్ధికి కృషి చేస్తున్నానన్నారు. పార్టీ అధిష్ఠానం ఆదేశిస్తే నియోజకవర్గంలో కీలకమైన బాధ్యతలు చేపట్టి, ప్రజలకు సేవ చేసుకోవడం జరుగుతుందన్నారు.

సర్వేయర్ సనత్‌కు సత్కారం



సచివాలయ సర్వేయర్ సనత్‌ను సత్కరిస్తున్న దృశ్యం

మునగపాక : విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు తగిన గుర్తింపు ఉంటుందని అరబుపాలెం సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు అన్నారు. అరబుపాలెం సచివాలయ సర్వేయర్ సనత్ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ అధికారిగా పురస్కారం అందుకున్న నేపథ్యంలో గురువారం అతనిని ఘనంగా సత్కరించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగులు బాధ్యతగా పనిచేసి మండలానికి పేరు తీసుకురావాలన్నారు. ఎంపీటీసీ బొడ్డేడ బుజ్జి, పంచాయతీ కార్యదర్శి రమణ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు కార్యక్రమంలో పాల్గొన్నారు.

తెరిపివ్వని వాన



కైలాసపట్నంలో వరి చేనులో కలుపు తీస్తున్న రైతులు

కోటవురట్ల : రెండు రోజులుగా వర్షం ఎడతెరిపి లేకుండా కురుస్తోంది. లోతట్టు ప్రాంతాలు, రహదారులు జలమయమయ్యాయి. పంట పొలాల్లోకి భారీగా వర్షం నీరు చేరుతోంది. వాతావరణం అనుకూలంగా ఉండడంతో రైతులు వ్యవసాయ పనులు ముమ్మరం చేశారు. వరిలో కలుపుతీత పనులు నిర్వహిస్తున్నారు. ఇటీవలి వరకు ఎండిపోయే స్థితికి చేరిన వరి చేలు ప్రస్తుత వర్షాలకు పచ్చగా కళకళలాడుతున్నాయి.

వలస కార్మికులకు వసతి కల్పించాలి

అచ్యుతాపురం(అనకాపల్లి): వలస కార్మికులకు సరైన వసతులతో కూడిన నివాసాలను కల్పించాలని సీఐటీయూ నాయకులు ఆర్.శంకర్ రావు, ఆర్.రాము జిల్లా కార్మిక శాఖ అధికారుల్ని కోరారు. ఈ మేరకు గురువారం వినతి పత్రం సమర్పించారు. వలస కార్మికులకు ఇస్తున్న షెడ్‌లలో మౌలిక సదుపాయాలు ఉండడం లేదని, ఇరుకైన గదుల్లో మగ్గిపోతున్నారని తెలిపారు. వలస కార్మికుల శ్రమను దోచుకుంటున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రమాదాల నియంత్రణపై అవగాహన



విద్యార్థులకు అగ్ని ప్రమాదాల నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

మాడుగుల: స్థానిక అగ్నిమాపక కేంద్రం సిబ్బంది ఓ ప్రైవేట్ స్కూల్లో విద్యార్థులకు, అగ్ని, నీరు, గ్యాస్ తదితర ప్రమాదాలు జరగకుండా నియంత్రణ చర్యలు, ప్రమాద సమయంలో తీసుకోవాల్సిన మెళకువలపై డెమో నిర్వహించారు. ఈ విన్యాసాలను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎంతో ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో ఫైర్ అధికారి రాజేశ్వరరావు, లీడింగ్ ఫైర్‌మెన్ శ్రీను, ఫైర్‌మెన్‌లు మణికుమార్, వరహాలు తదితరులు పాల్గొన్నారు.

అజోల్లాతో అధిక పాల దిగుబడి

- సమీకృత దాణాకు ప్రత్యామ్నాయం
- పాడి రైతులకు లాభదాయకం
- పశుపోషణ ఖర్చు తగ్గుదల



పశువులకు అందించేందుకు సిద్ధం చేసిన అజోల్లా



అజోల్లా తయారీపై అవగాహన కల్పిస్తున్న పశు వైద్యాధికారి ప్రదీప్‌కుమార్



మునగపాకలో అజోల్లా వినియోగంపై ఫ్లెక్సీ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు (ఫైల్)

మునగపాక : పాడి రైతులు తక్కువ ఖర్చుతో పాల దిగుబడులు పెంచుకునేందుకు ప్రభుత్వం పలు కార్యక్రమాలను అందుబాటులోకి తీసుకువస్తుంది. పశు పోషణలో అధిక ఖరీదు ఉండే సమీకృత దాణాను వినియోగించడం వల్ల పాల ఉత్పత్తి వ్యయం పెరుగుతుంది. పశు పోషణపై ఖర్చు తగ్గించితే పాడి పరిశ్రమ లాభదాయకంగా ఉంటుంది. ఈ దిశగా ఆలోచన చేస్తే అజోల్లా అనే నీలి ఆకుపచ్చ రంగులో ఉండే ఫెర్న్ సమీకృత దాణాకు ప్రత్యామ్నాయంగా ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు.

అజోల్లా అంటే....

అజోల్లా నీటిలో పెరిగే నాచుమొక్క. వాతావరణంలో నత్రజనిని సంగ్రహిస్తూ నీటి మీద తేలియాడుతూ పెరుగుతుంది. రైతులు ఇంటి వద్ద తక్కువ విస్తీర్ణంలో తక్కువ నీటితో తక్కువ శ్రమతో త్వరగా ఎక్కువ అజోల్లాను తయారు చేసుకోవచ్చు.

ఇవీ ప్రయోజనాలు

అజోల్లాను రైతులు వినియోగించడం ద్వారా బహుళ ప్రయోజనాలు ఉంటాయి. అజోల్లాను దాణాతో కలిపి వాడడం వల్ల పాల దిగుబడి 15 నుంచి 20 శాతం వరకు పెరుగుతుంది. పాలలో వెన్నశాతం పెరుగుతుంది. పశు దాణా ఖర్చు 20 నుంచి 25 శాతం వరకు తగ్గుతుంది. తద్వారా రైతుకు ప్రతి లీటరు పైన పదిరూపాయల వరకు అదనంగా లాభం వస్తుంది. గొర్రెలు, మేకలు, కోళ్లు, కుందేళ్లు, పందులు, చేపల పెంపకంలో అజోల్లా వాడడం వల్ల ఉత్పాదక శక్తిలో మార్పు కనిపిస్తుంది. పోషక పదార్థాలున్న అజోల్లా సమీకృత దాణాకు చక్కటి ప్రత్యామ్నాయంగా పనిచేస్తుందని అధికారులు తెలుపుతున్నారు.

విస్తృత ప్రచారం

రైతులకు మేలు చేకూర్చే అజోల్లాపై ప్రచారం విస్తృతం చేశారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు రైతుల కమతాల వద్దకు వెళ్లి సమీకృత దాణాకు ప్రత్యామ్నాయంగా అజోల్లా పనిచేస్తుందని ప్రచారం చేస్తున్నారు. పాల దిగుబడులు పెరగడంతో పాటు వెన్నశాతంలో కూడా మార్పులు కనిపించడంతో రైతులు సొంతంగా అజోల్లా తయారు చేసేందుకు ఉత్సాహం చూపుతున్నారు.

రైతులు అవగాహన పొందాలి



అజోల్లా తయారు చేసుకోవడంపై రైతులు అవగాహన పెంచుకోవాలి. సమీకృత దాణాకు ప్రత్యామ్నాయంగా అజోల్లా పనిచేస్తుంది. తక్కువ ఖర్చుతో పాల దిగుబడులు పెంచుకునేందుకు అజోల్లా దోహదం చేస్తుంది. గణనీయంగా ఆదాయం కూడా పెరుగుతుంది. ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి అజోల్లాపై అవగాహన సదస్సులు నిర్వహిస్తుంది. రైతులు కూడా అజోల్లా తయారు చేసుకునేందుకు ముందుకు రావాలి.

–లావేటి ప్రదీప్‌కుమార్, మండల పశువైద్యాధికారి, మునగపాక

ఘనంగా మరిడిమాంబ అమ్మవారి పండగ



మరిడిమాంబ అమ్మవారిని దర్శించుకుంచున్న మంత్రి అమర్‌నాథ్

మునగపాక : మండలంలోని నాగులాపల్లి, తిమ్మరాజుపేట గ్రామాల్లో మరిడిమాంబ అమ్మవారి పండగలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి ఆయా గ్రామాల్లో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. నాగులాపల్లిలోని అమ్మవారిని ఐటీ శాఖామంత్రి గుడివాడ అమర్‌నాథ్ దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు మంత్రి అమర్‌నాథ్‌ను శాలువాలతో సత్కరించారు. ఆయన వెంట మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు దొడ్డి వరహా సత్యనారాయణ, పాలసంఘ అధ్యక్షుడు దొడ్డి బుజ్జి, మాజీ సర్పంచ్ యల్లపు భాస్కరరావు, ఉప సర్పంచ్ దానకృష్ణ, వైఎస్సార్ సీపీ నేతలు ఇల్లా నాగేశ్వరరావు, నరాలశెట్టి సూర్యనారాయణ, దుబాసి నాయుడు, మొల్లేటి శంకర్, సిరసపల్లి ఎంపీటీసీ మద్దాల వీరునాయుడు పాల్గొన్నారు.

జనసేన నూతన కార్యవర్గం

మునగపాక : జనసేన మునగపాక గ్రామశాఖ కార్యవర్గం గురువారం ఎంపికైంది.స్థానిక జనసేన కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు టెక్కలి పరశురామ్ అధ్యక్షతన జరిగిన కార్యవర్గం ఎంపికలో గ్రామశాఖ అధ్యక్షునిగా సూరిశెట్టి అప్పలనాయుడును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షునిగా సీహెచ్ మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా ఆడారి సత్యనారాయణ, సహాయ కార్యదర్శిగా పెంటకోట సంతోష్, కోశాధికారిగా మద్దాల సాయి, కార్యవర్గ సభ్యులుగా కారుకొండ రాజు, తట్టా అశోక్, పి.ఉమామహేశ్వరరావు, బి.సురేంద్ర, ఎస్.కిషోర్, టి.సుధీర్, మోహిత్, లక్ష్మణ్ ఎన్నికయ్యారు.

ఘనంగా శ్రీకృష్ణాష్టమి పూజలు



కోటవురట్లలో కృష్ణాష్టమి వేడుకలు



పాయకరావుపేటలో...



మునగపాకలో కృష్ణుని విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం



గవర్ల అనకాపల్లిలో కృష్ణుని విగ్రహానికి పూజలు చేస్తున్న దృశ్యం

పాయకరావుపేట : శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా గురువారం కృష్ణ మందిరాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలో గల బృందావనం, కృష్ణవీధి మందిరాల్లోనూ, అలాగే మంగవరం, గోపాలపట్నం గ్రామాల్లో గల కృష్ణ మందిరాల్లో భక్తులు కృష్ణుడికి పూజలు నిర్వహించారు. ఆయా ఆలయాల వద్ద ఉట్టికొట్టే ఉత్సవం ఉత్సాహంగా నిర్వహించారు.

మునగపాక : మునగపాక సంతబయిల శ్రీ కృష్ణ కమిటీ, బీసీ కాలనీలోని యువత గురువారం ఉదయం నుంచి శ్రీ కృష్ణుని విగ్రహాలను బ్యాండ్ వాయిద్యాల నడుమ ఘనంగా ఊరేగించారు. గవర్ల అనకాపల్లిలో శ్రీకృష్ణుని విగ్రహానికి భక్తులు పూజలు చేశారు. నారాయుడుపాలెం, వెంకటాపురం తదితర గ్రామాల్లో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

కోటవురట్ల : స్థానిక సినిమాహాలు రోడ్డులో శ్రీ కృష్ణాష్టమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి భక్తులకు ప్రసాద వితరణ నిర్వహించారు. ఉట్టి సంబరంలో యువకులు పోటీ పడ్డారు. గోపికాకృష్ణుల వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు. పలువురు కళాకారుల 'జానపద నృత్య సంబరం' విశేషంగా అలరించింది. నిర్వాహకులు తుమ్మలపల్లి ఆంజనేయులు, పుత్రరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఉట్టి సంబరంలోని విజేతకు బహుమతి ప్రదానం చేశారు.

యలమంచిలి : మండలంలో పద్మనాభరాజు పేట గ్రామంలో కృష్ణాష్టమి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణుడు ఆలయం వద్ద బయ్యవరం గ్రామానికి చెందిన మురుకుర్తి అప్పలనాయుడు దంపతుల ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుక నిర్వహించారు. అర్చకులు గౌరీ శంకర్‌శర్మ స్వామి వారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు జరిపారు. పీఎస్‌ఆర్ పేట, బయ్యవరం గ్రామాలకు చెందిన పలువురు భక్తులు తరలివెళ్లి కృష్ణభగవానుడిని పూజించారు. భక్తులకు అప్పలనాయుడు ప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు గొన్నాబత్తుల శివ, మొగలపల్లి వెంకట సత్యనారాయణ, ఊటకూటి శేఖర్, జెర్రిపోతుల వెంకట్, కరిపిరెడ్డి జోగారావు, గెంజి రమణ జోగి, మొగ్గ బుజ్జి, జెర్రిపోతుల నానాజీ, గెంజి రాము, నక్కిన నూకేష్, మొల్లి అప్పారావు, కలిగెట్ల నానాజీ పాల్గొన్నారు.

అచ్యుతాపురం(అనకాపల్లి): మండలంలోని ఆవరాజాంలో శ్రీకృష్ణ అష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. శ్రీకృష్ణుని విగ్రహాన్ని కొలువు ఉంచారు. వారం రోజుల పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక యువకులు పాల్గొన్నారు.



అలరించిన జానపద నృత్యం



ఆవరాజాంలో కొలువు ఉంచిన శ్రీకృష్ణుని విగ్రహం



పద్మనాభరాజుపేటలో కృష్ణాష్టమి వేడుకల్లో భక్తజనం

ఆర్‌బీకేల ద్వారా రైతులకు విస్తృత సేవలు



ఉద్యానశాఖ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ సత్యవతి

తుమ్మపాల : రైతే రాజు అన్న మాటను నిజం చేస్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అన్ని గ్రామాల్లో రైతులకు అందుబాటులో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారని ఎంపీ బి.వి.సత్యవతి అన్నారు. పట్టణంలో వివేకానంద ఫంక్షన్ హాలులో ఉద్యానశాఖ ఆధ్వర్యంలో గురువారం హార్టికల్చర్ సైంటిస్టులు, ఎఫ్‌పీవో సభ్యులు, అధికారుల అవగాహన సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అన్ని సేవలు అందించేలా ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. రైతు భరోసా ద్వారా ప్రతి రైతుకు ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. వ్యవసాయంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడినప్పుడు ప్రత్యామ్నాయ పంటలు, ఉద్యాన పంటల సాగు వంటి అంశాలపై సదస్సులో చర్చించారు. ఉద్యాన శాఖ అధికారి ప్రభాకరరావు, ఎస్‌వీడీఎస్ కార్యదర్శి కర్రి జోగునాయుడు, శివకుమార్, బీసీటీ కె.శైలజ పాల్గొన్నారు.

10న ఉచిత మెగా వైద్య శిబిరం



అచ్యుతాపురం ఉన్నత పాఠశాలలో సదుపాయాలను పరిశీలిస్తున్న సేవా సంఘం సభ్యులు

అచ్యుతాపురం (అనకాపల్లి): అచ్యుతాపురం ఉన్నత పాఠశాలలో ఈ నెల 10వ తేదీన అమ్మా-నాన్న సేవా సంఘం ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మెడికల్ క్యాంప్ నిర్వహించే పాఠశాల ఆవరణలో మౌలిక సదుపాయాలను విశాఖ కేర్ ఆస్పత్రి మేనేజర్ ఆల్ఫా బ్రెట్టి గురువారం పరిశీలించారు. పాఠశాల హెచ్‌ఎం పద్మావతి, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, అమ్మ నాన్న సేవా సంఘం అధ్యక్షుడు కర్రి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు పెంటె చంటిబాబు, కార్యదర్శి అనసూరి అప్పలనాయుడు, సహాయ కార్యదర్శి పెద్దాడ నూకరాజు, పట్నాల భాస్కర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి



మాట్లాడుతున్న వాడ్రాపల్లి సర్పంచ్ నూకరాజు

మునగపాక : ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు గృహ సారథులు పాటుపడాలని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు కోరారు. వాడ్రాపల్లిలో గురువారం గృహ సారథులకు బీమా సదుపాయం కల్పించడంలో భాగంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్లు, గృహ సారథులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేయాలన్నారు. అలాగే పింఛన్ల పంపిణీలో కూడా సచివాలయాల కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారథులు సమన్వయం చేసుకుంటూ విజయవంతం చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలు అన్ని వర్గాలకు అందించేలా చూడాలన్నారు. సచివాలయాల కన్వీనర్లు పెతకంశెట్టి రామజోగినాయుడు, శీరా రమణమ్మ జోగినాయుడు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదుపై అవగాహన కల్పించాలి



ఈ-పంట నమోదును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి మోహనరావు

మునగపాక : ఈ-పంట నమోదుపై రైతులు దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి మోహనరావు కోరారు. నాగులాపల్లి, ఉమ్మలాడ గ్రామాల్లో ఆయన గురువారం పర్యటించారు. ఆయా గ్రామాల్లో జరుగుతున్న ఈ -పంట నమోదుపై అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ -పంట నమోదు వల్ల రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించాలని స్థానిక అధికారులకు సూచనలు చేశారు. మండల వ్యాప్తంగా వరి సాగు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆర్‌బీకేల ద్వారా రైతులకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి సీహెచ్.జ్యోత్స్నకుమారి, వీఏఏ సత్యరవిరాజ్ పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు ఇస్తున్న ఘనత జగనన్నదే..



పింఛన్ అందజేస్తున్న సర్పంచ్ అప్పలనర్స తదితరులు

రాంబిల్లి : అర్హులందరికీ పింఛన్లు అందిస్తున్న ఘనత జగనన్నదేనని మామిడివాడ సర్పంచ్ ఎం.అప్పలనర్స, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు నెట్టెం సత్యనారాయణ అన్నారు. మామిడివాడ సచివాలయంలో గురువారం కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. గతంలో పింఛన్లు మంజూరు కావాలంటే నానా అవస్థలు పడాల్సి వచ్చేదని ఇప్పుడు జగనన్న పాలనలో వాలంటీర్, సచివాలయ వ్యవస్థ ద్వారా ఎటువంటి లంచాలు, సిఫారసులు లేకుండా పింఛన్లు మంజూరు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్.సన్యాసిరావు, కె.మోహనరావు, రేబాక రాము, పంచాయతీ కార్యదర్శి సరస్వతి పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



దిమిలిలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, పోషణ సఖిలు

రాంబిల్లి: పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందని దిమిలి అంగన్‌వాడీ కార్యకర్తలు వరలక్ష్మి, సుజాత అన్నారు. దిమిలిలో గురువారం జాతీయ పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా ర్యాలీ నిర్వహించారు. పోషకాహార ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. విజయవాహిని ఫౌండేషన్ కోఆర్డినేటర్ హారిక మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులు క్రమం తప్పక పోషకాహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వి.సి.ఎఫ్ కోఆర్డినేటర్ సౌజన్య, టాటా ట్రస్టు పోషణ సఖిలు దుర్గ, పద్మ, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

టైలరింగ్,ఫ్యాషన్ డిజైనింగ్‌పై మహిళలకు శిక్షణ



శిక్షణ తరగతుల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న నిర్వాహకులు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని హరిపాలెం-అందలాపల్లిలో మహిళలకు టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్‌లో 60 రోజుల శిక్షణను గురువారం ప్రారంభించారు. నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా అనకాపల్లి జిల్లా సత్యసాయి సేవా సంస్థలు ఈ కార్యక్రమానికి రూపకల్పన చేశారు. సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు వై.కృష్ణంరాజు, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ కో-ఆర్డినేటర్ ఎ.రాజశేఖర్, హరిపాలెం గ్రామ సర్పంచ్ భర్త ఎం.సూర్యనారాయణ, కె.ఎం నాయుడు, కె.ఆదీశ్వరరావు, ఎస్.చంద్రశేఖర్, పాండురంగారావు, శ్రీను, బుద్ధ సత్యరామ్ పాల్గొన్నారు.

పట్టణ సుందరీకరణకు ప్రాధాన్యం



సన్యాసమ్మ చెరువు వాకింగ్ ట్రాక్‌ను పరిశీలిస్తున్న ప్రజారోగ్యశాఖ పర్యవేక్షక ఇంజినీరింగ్ అధికారులు

యలమంచిలి : పట్టణ సుందరీకరణకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు మున్సిపల్ ప్రజారోగ్యశాఖ పర్యవేక్షక ఇంజినీరింగ్ అధికారి (ఎస్.ఇ) గణపతిరావు అన్నారు. గురువారం ఆయన ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాయల్‌బాబు, మున్సిపల్ కమిషనర్ కె.వీరయ్యతో కలసి యలమంచిలి మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనులను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపాలిటీల్లో అసంపూర్తిగా నిలిచిపోయిన చెరువులు, పార్కులు, ఖాళీ స్థలాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. యలమంచిలి పట్టణంలో ఎమ్మెల్యే రమణమూర్తిరాజు, మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి ఆధ్వర్యంలో పట్టణ సుందరీకరణ దిశగా ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. చంద్రానగర్ ఓల్డ్ డంపింగ్‌యార్డ్‌లో సుమారు 20వేల మెట్రిక్ టన్నుల వ్యర్థాలను బయో రెమిడేషన్ పద్ధతిలో పూర్తిగా తొలగించినందుకు మున్సిపల్ అధికారులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. సన్యాసమ్మ చెరువు వద్ద వాకింగ్ ట్రాక్ నిర్మాణం, చెరువు అభివృద్ధి పనులు, ప్రధాన రహదారిలో కొమ్మాయి గుండం చెరువు ఆధునికీకరణ పనులను పరిశీలించారు. పట్టణంలోని అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు పలు సూచనలు సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఏఈ శ్రీనివాసరావు, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

17న వాసవీ క్లబ్‌ల సమావేశం



వాసవీ క్లబ్ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న టి.శ్రీనివాసరావు

అనకాపల్లిటౌన్: ప్రతి వ్యక్తి తన సంపాదనలో కొంత బడుగు, బలహీన వర్గాల ప్రజలకు సహాయంగా అందించాలని వాసవీ క్లబ్ అధ్యక్షుడు టి.శ్రీనివాసరావు అన్నారు. వైఎంవీఏ హాల్లో వాసవీ వారోత్సవాల ముగింపు కార్యక్రమం గురువారం రాత్రి జరిగింది. ఈనెల 17వ తేదీన పట్టణంలో అన్ని వాసవీ క్లబ్‌ల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి బి.మంగరాజు, కోశాధికారి నాగరాజు పాల్గొన్నారు.

పలు చోట్ల చిరుజల్లులు

కశింకోట: కశింకోట ప్రాంతంలో గురువారం చిత్తడి వర్షం కురిసింది. ఉదయం నుంచి దాదాపు మధ్యాహ్నం వరకు జల్లులుగా వర్షం పడింది. దీంతో వాతావరణం చల్లబడింది. వర్షం ఎండిపోతున్న వరి నారుమళ్లు, నాటిన వరి పొలాలకు మేలు చేస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.